# అంతర్జాతీయులు

సూతుడు ఆరోజు ఉదయాన్నే కొంచెం చలిగావున్నా బద్ధకించక శుచిగా స్నానం చేసి సంధ్యా వందనం కానిచ్చి, కళ్ళు మూసుకుని ధ్యాన్నం చేస్తూ, మర్రిచెట్టు క్రింద కూర్చున్నాడు.

అప్పటిదాకా చెట్టుమీద కిచకిచలాడుతున్న రకరకాల పక్షులు ఆయన తపస్సు కి భంగం కలుగకుండా మౌనంగా వుండి, ఆయన చెప్పబోయే కొత్త కథ కోసం ఎదురు చూస్తూ కూర్చున్నాయి.

అందరికన్నా ముందుగా వచ్చి ఆయన దగ్గరగా కూర్చున్నాడు చిన్న ముని. ఎంత నెమ్మదిగా వచ్చినా అతని అడుగుల సవ్వడి విని, కళ్ళు తెరిచాడు సూత మహా ముని.

చిన్న ముని ఆయనకి నమస్కరించి చిన్నగా అన్నాడు "మునివర్యా! నాకు ఒక విషయం అర్ధమవటం లేదు. మహాత్మా గాంధీగారు నాలుగేళ్ళుండి భారతదేశానికి తిరి గి వచ్చేద్దామని సౌతాఫ్రికాకి వెళ్ళారు. కానీ అక్కడ ఇరవై ఒక్క సంవత్సరాలు వుండి పోయారు. ఆయనక్కడ తెల్లవాళ్ళ నిరంకుశత్వాన్ని ఎదిరిస్తూ సాగించిన శాంతి సమ రం చూసి స్పందించి, ఆయన్ని భారతదేశానికి తిరిగి వచ్చి బ్రిటిష్‌వాళ్ళ మీద జరుగు తున్న స్వరాజ్య సంగ్రామంలో నాయకత్వం వహించమని గోపాలకృష్ణ గోఖలే ఆయన కి కబురుపంపించారు..."

సూతుడు చిరునవ్వు నవ్వి, "నీకు భారతదేశ చరిత్ర బాగానే వంటబట్టిందే"

అన్నాడు.

చిన్నముని ఆయన మాటలకి కొంచెం గర్వపడి, మరి కొంచెం సిగ్గుపడుతూ అన్నాడు "ఆఁ! నాకు తెలిసిన నాలుగు మాటలు మన కథకు అవసరమైనంత వరకూ చెబుతున్నానంతే. ఆయన ఇండియాకి తిరిగి వచ్చేసినా, ఆయన పెద్ద కొడుకు మణీలాల్, గాంధీగారు స్థాపించిన న్యూస్ పేపర్ని నడుపుతూ సౌత్‌ఆఫ్రికాలో వుండిపోయాడు. మణిలాల్ కూతురు ఈలా గాంధీ, అంటే మహాత్మా గాంధీగారి మనవరాలు ఆయన అడుగుజాడల్లోనే నడిచింది. నల్లవాళ్ళ సమస్యలతో పాటు, సమాజంలో స్త్రీలకూ, పిల్లలకూ జరుగుతున్న అన్యాయాలను ఎత్తిచూపుతూ శాంతి ఉద్యమం లేవదీసింది. చాల సార్లు జైలుపాలు కూడా అయింది. ఆవిడ ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్‌లో చేరి దేశం కోసం పోరాడింది. అక్కడ తెల్లవాళ్ళ పాలన అయిపోయాక ఆవిడ పార్లమెంటు మెంబరుగా ఎన్నికయింది. ఆవిడకు ఇప్పుడు అరవై ఏళ్ళ వయసు. అయినాఆవిడ తన దేశం కోసం, రోజుకి పదహారు గంటల పైన పనిచేస్తున్నది...."

చిన్నముని మాట్లాడుతున్నప్పుడే మిగతా మునిపుంగవులందరూ వచ్చి అక్కడ ఆసీనులయారు.

ఆ మాటలు విన్న శౌనకుడు అన్నాడు. "ఇండియాలో పుట్టినా వేరే దేశాల పౌరసత్వం తీసుకుని అక్కడే నివసిస్తున్నవాళ్ళూ, తమ పూర్వీకులు భారతీయులయినా వేరే దేశాల్లో పుట్టి ఆ దేశ పౌరులుగా జీవిస్తున్నవాళ్ళూ,విదేశాల్లో పేరు ప్రఖ్యాతులు సంపాదించుకుని ఆయాదేశాల అభివృద్ధి కోసం రాజకీయంగా, ఆర్థికంగా, సంఘసేవాపరంగా ఎంతో పాటుపడుతున్నారు"

శౌనకుడి మాటలకు అడ్డు వస్తూ ఉత్సాహంగా అన్నాడు చిన్నముని "ఔను. నేను అదే చెబుతున్నాను. ఈలా గాంధీలాగానే ఫిజీదీవుల మాజీ ప్రెసిడెంట్ మహేంద్ర చౌదరి, ఈ సంవత్సరపు మాష్టర్స్‌గోల్ఫ్ ఛాంపియన్ ఫిజీ దేశీయుడు అయిన విజయ్ సింగ్, అలాగే నాటి-నేటి క్రికెట్ ప్లేయర్లు రామన్ సుబ్బారావ్, కన్హాయ్, కాళీచరణ్, రాంప్రకాష్, రమేష్ పటేల్..."

శుకమహర్షి అతన్ని ఇక ఆపమని చేత్తో వారిస్తూ "అవును నాయనా! నువ్వు గుంటూరు చేతాండంత పొడుగున ఆ పేర్ల జాబితా చదవక్కర్లేదు. నువ్వు చెప్పదలుచుకున్న విషయం అదిగో ఆ కిష్కింధవాసికి కూడా అర్థమయిపోయి, తల అడ్డంగా వూపుతున్నది" అన్నాడు సుతిమెత్తగా కోప్పడుతూ.

చిన్నముని సణుగుతూ అన్నాడు "నేనవన్నీ ఎందుకు చెబుతున్నానంటే అలాటి అంతర్జాతీయుల కథ ఒకటి విందామని..."

సూతుడు చిరునవ్వు నవ్వాడు "నీ కోరిక నా కర్థమయింది చిన్నముని! సరే! ఈ సారికి అలానే కానిద్దాం. ఒక అంతర్జాతీయుని కథను ఈఎన్నారై కథలలో ఆరవ కథగా చెప్పుకుందాం" అని దివ్యదృష్టితో భూగోళం వేపు చూపు సారించాడు.

ఆయన చూపు, అంతరిక్షంలోని గ్రహాలనీ ఉపగ్రహాలనీ తప్పించుకుని, అమెరికా లోని అనంతరామయ్యగారింటి మీద నిలిచింది.

సూతుడు ఒక్క క్షణంలో ఆ కథని అర్థం చేసుకుని, మళ్ళీ ఒక చిరునవ్వు విసిరి కథ మొదలు పెట్టాడు.

"అనంతరామయ్యగారి మనవరాలు లీసా చక్కటి అమెరికన్ ఇంగ్లీషులో ఆయన్న డిగింది- తాతయ్యా! నువ్వు అమెరికాకి వచ్చి ఎన్నాళ్ళయింది. అప్పుడు అమెరికాలో నీ జీవితం ఎలా వుండేదీ- అని.

తెల్లటి ముఖం మీద లేత నీలంరంగు కళ్ళతో ఎంతో అందంగా వున్న ఆరేళ్ళ లీసా ని దగ్గరకు తీసుకుని ఆ అమ్మాయి లేత బుగ్గ మీద ప్రేమగా ముద్దు పెట్టుకుని "ఏం? నా కథ తెలుసుకోవాలనివుందా?" అని అడిగాడు అనంతరామయ్య.

"అవును నాన్నా! నాకు కూడా ఎప్పటినించో తెలుసుకోవాలని వుంది" అన్నది అక్కడే వున్న ఆయన కోడలు సిండీ చిరునవ్వుతో.

"ఇక్కడేదో తెలుగు సినిమాలో దర్శకేంద్రుడు పప్పులో కాలేసినట్టుగా వుంది. సిండీ అనంతరామయ్యగారికి కోడలేమిటి? ఒకవేళ అయిందనుకోండి ఆయన్ని మామ య్యా అనో, మామగారూ అనో పిలవాలికానీ నాన్నా అని పిలవటమేమిటి?" అన్నది చెట్టు మీద నల్ల కాకి.

"అందుకే అంటుంటాను, అలా ఆ ఇళ్ళ మీద వాలి, కావు కావుమంటున్నప్పుడు కాస్త ఆ ఇళ్ళల్లోకి తొంగి చూసి, కొంచెం లోకజ్ఞానం సంపాదించుకోమని" కోప్పడ్డాడు శౌనకుడు.

శుకమహర్షి సౌమ్యంగా చిలుకభాషలో నల్లకాకితో ఇట్లా చెప్పాడు. "అమెరికా లో ఫాదర్ఇన్‌లా మదర్ఇన్‌లా అని చెప్పేటప్పుడు చెబుతారు కానీ, పిలిచేటప్పుడు ఫాదర్ అనీ, మదర్ అనీ పిలుస్తారు. అంటే తెలుగులో నాన్నా, అమ్మాఅనే కదా అర్థం"

అర్థమయినట్టు తల వూపుతుంటే, నల్లకాకి నోట్లోని ఎర్రని దొండపండు చెట్టు మీద నించి, అక్కడే నుంచుని సోద్యం చూస్తున్న గాడిద.మీద పడింది.

"కాకి ముక్కుకి తోడు ఎర్రటి దొండపండు కూడాను" అన్నది గార్ధభస్వరం తో గాడిద.

సూతుడు ఆ కాకిగోల చూసి ఒకసారి మందహాసం చేసి కథ కొనసాగించాడు.

"శనివారం పొద్దున్నే కోడలు సిండీ పిల్లలిద్దర్నీ, ఆరేళ్ళ లీసాని మూడేళ్ళగోపాల్ నీ, తీసుకుని అత్తమామల ఇంటికి వచ్చింది. భర్త వేణు బయట పనులు చూసుకుని అక్కడికి సరాసరి వచ్చేస్తానని చెప్పాడు. కారణం ఆరోజు శ్రీరామనవమి. అందుకని జానకి పూజ చేసుకుంటూ, కొడుకునీ కోడల్నీ పిల్లల్నీ రమ్మన్నది.

జానకి పూజ చేసుకుంటుంటే, పిల్లలు ఇద్దరూ పక్కనే కూర్చుని వాళ్ళూ పూజ చేశారు. సిండీ పూజకు కావలసినవి అందిస్తూ అక్కడే జానకికి సహాయంగా కూర్చున్నది. అనంతరామయ్య పెద్ద భక్తుడు కాదు కనుక, టేప్ రికార్డరులో భక్తి పాటలు వినిపిస్తూ మధ్యమధ్యలో అక్కడికి వస్తూ పోతున్నాడు.

పూజానంతరం అందరూ వేణు రాక కోసం ఎదురు చూస్తుండగా అదే ప్రశ్న మళ్ళీ అడిగింది లీసా.

అనంతరామయ్య "అలాగే అమ్మా! వేణు రావటానికి ఇంకో గంటపడుతుందేమో. ఈలోగా కథ చెప్పుకుందాం. నేను 1960 సంవత్సరంలో జనవరి పదకొండో తేదీ న్యూయార్కులో దిగాను. ఆస్టిన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్‌లో బిజినెస్ ఎడ్మినిస్ట్రేషన్ లో ఎం.ఎస్. చదువుదామని వచ్చాను. రెండేళ్ళలో చదువు పూర్తిచేయటం, చదువు పూర్తి కాక మునుపే ఇండియా వెళ్ళి జానకిని పెళ్ళి చేసుకుని రావటం, తరువాత రెండేళ్ళలో వేణు పుట్టటం చకచకా జరిగిపోయాయి"

తన నీలం కళ్ళ మీద మబ్బుల్లా వున్న కనురెప్పలు టపటప లాడించి లీసా అంది "మరీ స్పీడుగా వెడుతున్నావు తాతయ్యా.." అని.

"అవును మరి.. ఆ రోజుల్లో నేను కుర్రవాడిని కదా! చిన్నప్పుడు బాగా ఎంగ్‌గా వుండేవాణ్నిలే! అందుకే అంతా స్పీడుగా జరిగిపోయింది..."

నవ్వింది సిండీ. ఆమె నవ్వుతున్నప్పుడు బుగ్గల మీద సొట్టలు పడి అందంగా ఎంతో సౌమ్యంగా వుంటుంది ఆమె ముఖం. ఆమె అందం వేణుని ఆకర్షిస్తే ఆమె ముఖంలోని నిర్మలత్వం, అనంతరామయ్యనీ జానకినీ ఆకట్టుకున్నాయి. అందుకే వాళ్ళ వివాహానికి వెంటనే అంగీకరించారు.

అనంతరామయ్య కథ చెబుతున్నాడు- నేను చాల సాదా సీదా మనిషిని. ఆ రోజుల్లోనూ, తర్వాతా వచ్చిన చాలమంది విదేశీయుల్లాగానే నేనూ అమెరికాలో మూడేళ్ళు చదువుకుని ఇండియాకి వెళ్ళిపోదామని ఇక్కడికి వచ్చాను. కానీ ఇక్కడ చదువుకయిన అప్పు తడిసి మోపెడయింది. ఆ అప్పుతీర్చేసి తిరిగి వెడదామనుకుని ఉద్యోగంలో చేరాను. ఈ లోపలే మీనాన్న పుట్టటం, పెరగటం, స్కూల్లో చేరటం.... అలా అలా కాలం గడిచిపోయింది. తర్వాత ఇక్కడి జీవితానికి అలవాటు పడిపోయి, ఇక్కడే వుండిపోటా

నికి విశ్చయించుకున్నాం"

"మరి మీదేశం ఇండియానా? అమెరికానా?" అడిగాడు గోపాల్ అమాయకంగా. వాడి తెల్లటి ముఖంమీద నల్లటి జుట్టు ఫాను గాలికి ఎగురుతూ ముచ్చటగావుంది

గోపాల్‌ని దగ్గరకు తీసుకుని ఒళ్ళో కూర్చొ పెట్టుకుంటూ పెద్దగా నవ్వాడు అనంతరామయ్య.

"మాకయితే రెండూనూ! ఇక్కడ మూడు తరాల వాళ్ళం వున్నాం. నేనూ మీ బామ్మ జానకి ఇండియాలో పుట్టి పెరిగాం. నలభై ఏళ్ళుగా అమెరికాలో ఉంటున్నాం. అమెరికన్లమయి పోయాము. రెండో తరం మీ అమ్మా నాన్నా. ఇద్దరూ అమెరికాలో పుట్టారు. పెరిగారు. మీ అమ్మ నూటికి నూరుపాళ్ళు అమెరికన్. మీ నాన్నకి జాతిపరంగా ఇండియాలో వేళ్ళున్నాయి కానీ, వాడికి ఇండియా కన్నా ఇండియా భాషల కన్నా, ఆ సంస్కృతి కన్నా అమెరికాయే ఎక్కువ పరిచయం"

గోపాల్‌కి ఆయన చెప్పింది పూర్తిగా అర్థం కాలేదని ముఖకవళికలు చెబుతున్నా, అర్థమయిన ఆ కాస్త విషయాన్ని పూర్తిగా అర్థం చేసుకోటానికి ప్రయత్నిస్తూ అన్నాడు "మరి నాన్నెప్పుడూ ఆవకాయ తింటాడు కదా?" అని.

నవ్వాడు అనంతరామయ్య. "తిండిలో మాత్రం మీ నాన్న ఇండియనే కాదు. అచ్చం తెలుగువాడు కూడానూ" అన్నాడు.

"నాకూ ఆవకాయంటే ఇష్టమే కానీ...కారం!" అంది లీసా నాలిక బయటకు పెట్టి.

అనంతరామయ్య అన్నాడు "తర్వాత మూడోతరం వాళ్ళు మీరు.. "

అప్పుడే అక్కడికి వచ్చిన జానకి "రెండు సంస్కృతులూ కలిసే వుండాలని, మా ప్రమేయమేమీ లేకుండానే మీ అమ్మా నాన్నా మీ ఇద్దరికీ లీసా అనీ, గోపాల్ అనీ పేర్లు పెట్టారు" అన్నది సిండీని ప్రేమగా చూస్తూ. ఆవిడ కోడల్ని ఆప్యాయంగా చూసుకుంటుంది. అలాగే సిండీకి కూడా జానకి అంటే గౌరవం.

"మా అమ్మా నాన్నా ఎక్కడ కలుసుకున్నారు?" అని అడిగింది లీసా.

"మీ అమ్మనే అడుగు" అన్నది జానకి నవ్వుతూ.

సిండీ అన్నది "ఇప్పటినించే ఎందుకే నీకవన్నీ? ఇంకా చాల రోజులుందిలే అలాటి కథలకి.... "

ఆ ప్రేమ కథ వినటానికి ముందుకు జరిగి కూర్చున్న చిన్నముని, అది విని కొంచెం నిరుత్సాహపడ్డాడు.

"ఆ ప్రేమ కథని ఇప్పుడు వద్దు లెండి. ఈ కథలో ఇంకా చెప్పుకోవలసిన విషయాలు చాల వున్నాయి. అదీకాక ఈ పెళ్ళిళ్ళ పురాణం చాల పెద్దది. అది వచ్చే సంచికలో

చెప్పుకుందాం" అన్నాడు శౌనకుడు.

"ఇంకా నయం. వచ్చే సంచికలో అన్నారు. మిగతాది వెండితెరపై చూడమంటారేమో ఇక్కడ వెండి తెరలు లేవే అని భయపడి చచ్చాను" అన్నాడు చిన్నముని.

సూతుడు ఒక చిరునవ్వు నవ్వి కథ కొనసాగించాడు.

"ఈలోగా వేణు రావటంతో అక్కడ కూడా టాపిక్ మారిపోయింది.

గోపాల్‌ని ఒళ్ళో కూర్చో పెట్టుకుని సోఫాలో కూర్చున్నాడు వేణు.

"ఎలా జరిగింది నాన్నా మీ ఎఫ్.ఐ.ఎ. మీటింగ్?" అని అడిగాడు.

ఎఫ్.ఐ.ఎ. అంటే ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ అసోషియేషన్స్. తెలుగు, తమిళ్ గుజరాతి హిందీ కన్నడ బెంగాలీ మొదలైన సాంస్కృతిక సంఘాలన్నిటినీ రాజకీయ పరంగా కలుపుతూ, భారతదేశం గురించి ఆయా వూళ్ళలోని అమెరికన్ గవర్నమెంటులోని రిప్రజంటేటివ్‌ల దగ్గర లాబీ చేసే సంస్థ. అమెరికాలోని చాల ఊళ్ళల్లో ఈ సంస్థకి బ్రాంచీలున్నాయి. ఆ ఊళ్ళో ఆ విభాగాన్ని స్థాపించింది అనంతరామయ్యే. ఆ ముందు రోజు సాయంత్రమే అక్కడి స్కూలు ఆడిటోరియంలో స్థానిక కాంగ్రెస్‌మన్‌తో (అంటే ఇండియాలో పార్లమెంటు మెంబరులాగా అన్నమాట) ఒక టౌన్ హాల్ మీటింగ్ జరిపించాడు. ఆ మీటింగ్‌కి నాలుగు వందల మంది ఇండియన్స్ వచ్చారు. ఆ కాంగ్రెస్‌మన్‌కి భారతదేశం మీద సద్భావం, ప్రొఫెషనల్‌గా కష్టపడి బాగా పైకి వచ్చిన అక్కడి ఇండియన్స్ అంటే గౌరవం వున్నాయి. న్యూక్లియర్ బాంబు వల్ల ఇండియా మీద ఆంక్షలు విధించినప్పుడు ఇండియాని సమర్ధించిన వాళ్ళల్లో ఆయన ప్రముఖుడు. ఆయన భారతదేశం కోసం తనేం చేయబోతున్నాడో ఒక పావు గంట సేపు మాట్లాడాడు. తరువాత ప్రేక్షకుల ప్రశ్నలకు ఆయన సమాధానాలు సలహాలు ఇవ్వటం ఇంకొక గంటన్నర సేపు జరిగింది. సాఫ్ట్‌వేర్ నిపుణులకు అమెరికాలో కొరత వున్నందున, ఇజ్రేయల్, ఇండియా మొదలైన దేశాలవారికి ఎక్కువ వీసాలు ఇవ్వటం గురించీ, క్లింటన్ ఇండియా పర్యటన అయిన తరువాత అమెరికా ఇండియా వేపు మొగ్గుచూపటం గురించీ, చర్చలు జరిగాయి. అదే చెప్పాడు అనంతరామయ్య వేణుకి.

అనంతరామయ్య అన్నాడు "పేపర్లో ఈ ఆర్టికల్ చదివావా? వాషింగ్టన్‌లో భారత రాయబారి నరేష్‌చంద్రకన్నా పాకిస్థాన్ రాయబారి మలీహా లోధీ ప్రభ ఎక్కువగా వెలుగుతున్నదిట. ఆమె తన అధికార లాబీయిస్టులు లానీ డేవిస్, ఛార్లీ విల్సన్‌ల మద్దతుతో పనులు సునాయాసంగా చక్కబెట్టుకుంటున్నదిట.ఈ ఇద్దరు లాబీయిస్టులు యు.ఎస్.ఏ. జస్టిస్ డిపార్టుమెంట్‌తో రిజిస్టరయిన వారే. ఒకతను క్లింటన్‌కి వ్యక్తిగత లాయర్ కూడాను"

"మరి ఇండియా వాళ్ళేం చేస్తున్నారు?"అడిగాడు వేణు.

"ఏం చేస్తారు. భోజనం. వెర్నర్ లిఫర్ట్, ఆప్కో అనే లాబీయింగ్ సంస్థలు పేరుక యితే వున్నాయి కానీ వాళ్ళకి భారతదేశం మీద ఏమీ అవగాహన లేదనీ, వాళ్ళని తక్ష ణమే తొలగిస్తే మంచిదనీ ఎంతోమంది ఎన్నారైలు అడుగుతున్నారు. అంతేకాదు భారత అమెరికా ద్వైపాక్షిక సంబంధాలను అసాధారణ స్థాయిలో ప్రభావితం చేసిన ప్రెసిడెంట్ క్లింటన్ పర్యటన వెనక ఇండియా ప్రభుత్వ కృషి, రాయబార వర్గాల పని కన్నా, మన ఎన్నారైల పట్టుదల చాల గట్టిగా వుంది. ఇండియన్ కాన్సులేట్ డిపార్టుమెంటు కూడా దేనికీ పనికిరావటం లేదు. మరి ఇలాటి వాళ్ళని ఎందుకు పంపిస్తారో అర్ధంకావటం లేదు"

"సరే! మనల్ని ఇబ్బంది పెట్టకుండా పాస్‌పోర్ట్‌లూ వీసాలూ ఇవ్వటానికే వాళ్ళకి మనసొప్పదు. ఇటు ఒక్కళ్ళూ అక్కడ పనిచేసి చావరు. అటు అమెరికన్స్‌తోనూ ఏమీ లాబీ చేయటం చేత కాదు. ఉట్టి కెక్కలేనమ్మ వూళ్ళేలుతానన్నదిట. మరెందుకో ఈ తిండి దండగ తిమ్మరాజులు" అన్నది జానకి కోపంగా.

అనంతరామయ్యకి తెలుసు ఆమె కడుపు మంటకి కారణం. జానకి పాస్‌పోర్ట్ గురించి కాన్సలేట్ ఆఫీసుకి ఒకసారి ఫోన్ చేస్తే వాళ్ళు ఎంత సంస్కారహీనంగా, తల తిక్కగా మాట్లాడారో.

"నాకు ఆకలేస్తున్నది" అన్నాడు వేణు.

"అంతా రెడీ. రండి లంచ్ తిందాం" అని లేచింది సిండీ.

అందరూ డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్నప్పుడన్నాడు వేణు "ఒక శుభవార్త నాన్నా! మా కంపెనీ ఐ.పి.ఓ. కి (ఇనీషియల్ పబ్లిక్ఆఫరింగ్) అందరూ ఒప్పుకున్నా రు. ఇంకో నెల రోజుల్లో బహుశా పబ్లిక్ ఇష్యూ ఇస్తాం"

అనంతరామయ్య ఒకసారి అతన్ని దీక్షగా చూసి "కంగ్రాచ్యులేషన్స్ వేణూ! మంచివార్త చెప్పావ్. నీ అభివృద్ధికి నేను చాలా గర్వపడుతున్నాను" అన్నాడు

ఆయన కళ్ళల్లో మెరుపూ, గొంతులో గర్వం తొంగి చూస్తున్నాయి.

ఆ మాటలు విన్న జానకి అతని ప్లేటులో ఒక స్వీటు వేసి "రెండేళ్ళనించీ పగలూ రాత్రీ కూడా చూడకుండా చాల కష్టపడ్డావు నాన్నా. నీ కష్టానికి ఫలితం అది" అన్నది ఆప్యాయంగా, ఆనందంగా.

సిండీ చటుక్కున లేచి, అతని బుగ్గమీద ముద్దు పెట్టుకుని "యు ఆర్ గ్రేట్! వేణూ. కంగ్రాచ్యులేషన్స్. యు డిజర్వ్ ఇట్" అన్నది.

పిల్లలకి వివరం అర్థం కాకపోయినా, వాళ్ళ నాన్న ఏదో గొప్పపని చేస్తున్నాడని అర్ధమయిపోయి, చిరునవ్వులు చిందించారు.

చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణంతో ఆ ఇల్లు నిండిపోయింది.

అప్పుడే ఫోన్ మోగింది. జానకి ఫోన్ తీసుకుని ఒక్క క్షణం నవ్వుతూ మాట్లాడి "ఇప్పుడే లంచ్ చేయబోతున్నారు. ఉండండి మాట్లాడతారేమో కనుక్కుంటాను" అని, ఫోన్ మౌత్‌పీస్‌ని చేత్తో మూసేసి అనంతరామయ్యతో అన్నది."సిటీ కౌన్సిల్‌మన్ మారియో. మాట్లాడతారా"

"నేను లంచ్ అవగానే పిలుస్తానని చెప్పు" అన్నాడు.

జానకి ఆయనతో చెప్పి ఫోన్ పెట్టేశాక అన్నాడు అనంతరామయ్య.

"నన్ను సిటీ కౌన్సిల్ ఎలక్షన్లలో ఈసారి నుంచోమని బలవంత పెడుతున్నాడు మారియో"

వేణు వెంటనే అన్నాడు "నుంచోండి నాన్నా. మంచి అవకాశం"

"అవును. ది సీజ్ ఎ గ్రేట్ ఆపర్చ్యూనిటీ. మీరు తప్పక గెలుస్తారు" అన్నది సిండీ.

"ఆఁ! మనకెందుకండీ ఆ రాజకీయాలు. ఉద్యోగంలోనించి రిటైరయిపోయారుగా. హాయిగా తిని కూర్చోక" అన్నది జానకి.

అనంతరామయ్య నవ్వాడు "ఇక్కడ చిన్నపిల్లలకు సైతం నేర్పించేదేమిటో తెలుసా. డూ యువర్ పార్ట్. యు కెన్ మేక్ ఎ డిఫరెన్స్ అని. నేను ఉద్యోగంలోనించి రిటైరయానే కానీ జీవితంలో నించి కాదుగా. నలభై ఏళ్ళు ఈ దేశంలో వీళ్ళ ఉప్పు తిన్నాం. కనీసం నాలుగేళ్ళు సిటీ కౌన్సిల్లో పనిచేయనీ. కాస్త దేశసేవ చేయటంలో తప్పులేదులే" అన్నాడు.

"అవును నాన్నా. ఈ మధ్య ఇండియన్స్, పాలిటిక్స్‌లో బాగా పైకి వస్తున్నారు కూడాను. ఆల్ గోర్‌కి కుడి భుజం రామ్ ఉప్పులూరి. అలాగే క్లింటన్ ఆఫీసులో సైన్స్ అండ్ టెక్నాలజీ పాలసీలకు సీనియర్ ఎనలిస్ట్‌గా విజేంద్ర అగర్వాల్ అనే ప్రొఫెసర్ పని చేస్తున్నాడు. అలాగే హెల్త్ కేర్ విషయాల్లో ముఖ్య సలహాదారు కూడా మనవాడే. మొన్నమొన్నటి దాకా ఈక్వల్ ఆపర్చ్యూనిటీ ఎంప్లాయ్‌మెంట్ కమిషన్‌కి ఛైర్మన్ చెరియన్ అనే ఇండియన్ అమెరికన్" అన్నాడు వేణు.

ఆ మాటలు అతను అంటుండగా టీవీలో ఫాక్స్ న్యూస్ ఛానల్‌లో, చక్కటి అమెరికన్ ఇంగ్లీష్‌లో ప్రపంచ వార్తలు చదువుతున్నది ఉమా పెమ్మరాజు. సిండీ చిరునవ్వుతో టీవీ వేపు వేలు చూపించింది.

సూతుడు కథ చెప్పటం ఒక్క క్షణం ఆపాడు.

ఆ అవకాశం చూసుకుని, తన కిచకిచలు ఆపి చెట్టు మీది బంగారు పిచ్చిక అడిగింది. "గురువుగారూ. ఈ అంతర్జాతీయులయిన భారతీయులు ఇంకా ఏఏరంగాల్లో

వున్నారంటారు"

ఆకుపచ్చని ఆకుల్లో దాగిన, ఆకుపచ్చని రామచిలుక, దురద పెడుతున్న తన చిలుక ముక్కుని ఎండుటాకులకు రాస్తూ "ఈ మాత్రం దానికి గురువుగారెందుకు. తపస్సు చేసుకుంటున్న ఈ మహా ఋషులని, నేనెన్నో ఏళ్ళ నించీ దీక్షగా చూస్తున్నాను కదా. హ్రస్వదృష్టి లేకపోతే మానె, కనీసం దూరదృష్టయినా నాకు కాస్త అంటకుండా పోయిందా. చూద్దాం వుండండి" అని మెడని వయ్యారంగా తిప్పి పడమర దిక్కుగా చూసి, కళ్ళు చిట్లించింది.

"మరీ బడాయిపోతున్నావు. నీకేం కనపడుతుంది" అంది పిచ్చిక కిచకిచమంటూ.

రామచిలుక అన్నది " అలా చూడండి. అమెరికాలో వాల్ స్ట్రీట్‌లో ఎంతమంది ఇండో అమెరికన్ ఎనలిస్టులు వున్నారో. ఎన్ని హైటెక్ కంపెనీలకి సి.ఇ.ఓ.లు, ప్రెసిడెంట్లుగా వున్నారో. అలాగే హాలీవుడ్ సినిమారంగంలో సిక్స్త్ సెన్సులాటి గొప్ప సినిమా తీసిన నైట్ శ్యామలన్, మీరా నాయర్‌లాటి వాళ్ళున్నారు. చాలమంది యూనివర్సిటీ ప్రొఫెసర్లకు ప్రెసిడెంట్స్ యంగ్ సైంటిస్ట్ ఎవార్డులు కూడా వచ్చాయి. నోబుల్ ప్రైజ్ తీసుకున్న ప్రముఖుల్లో హరగోవింద్ ఖురానా,చంద్రశేఖర్‌లు వున్నారు. అలాగే ఇంగ్లండులో పారిశ్రామికవేత్త స్వరాజ్‌పాల్, నటుడు బెన్‌కింగ్స్‌లీ..."

చిన్నముని ఆ చిలుక పలుకులకు అడ్డం వస్తూ అన్నాడు. "ఇందాక నేనదే విషయాన్ని చెబుతుంటే గుంటూరు చేంతాండంత లిస్ట్ అని కోప్పడ్డారు. మరిప్పుడో...."

శుకమహర్షి మందలిస్తూ అన్నాడు "అందుకే నాయనా! నువ్వు పెద్దవాడివవుతున్నా నిన్ను చిన్నమునీ అనేది. ఆ పిల్ల పిచ్చికకు అర్థం కాక అడిగింది కనుక, మన రామచిలుక చెప్పింది... దాంట్లో తప్పేముంది.."

"ఏమిటో బాబూ ఈ సందర్భా సందర్భాలు మీ రామచిలకలకే అర్థమవాలి" సణిగాడు చిన్నముని శుకమహర్షిని క్రీగంట చూస్తూ.

శౌనకుడు తన బారు గడ్డాన్ని నిమురుకుంటూ అన్నాడు. "గంగా నదిలోని ఒక పాయ, యమునా నదిలో కలిసినప్పుడు అది యమునా నదయి పారుతుంది కానీ, గంగానదిలా కాదు కదా. యమునా నదీ ప్రవాహంతో అంతర్లీనమయిపోయి వెడుతూ వుంటుంది. అలాగే ఈ అంతర్జాతీయులు కూడానూ..."

"ఓహో! అయితే ఇదేనన్న మాట ఈ అంతర్జాతీయుల కథ!" అన్నది చలిచీమ ఆ కాస్త చలికే వణికిపోతూ.

"చలి లేకపోయినా ఎందుకలా వణికిపోతావు" అన్నది గొంగళి పురుగు; నిండుగా కప్పుకున్న తన గొంగళి వెచ్చదనం అనుభవిస్తూ.

"అవును. ఇవాళ కొంచెం చలి అనిపిస్తున్నది. ఇక ఈ రోజుకి మనం కథ చెప్పుకోవటం ఆపి ఇళ్ళకి బయల్దేరితే మంచిది" శౌనకుడు లేచి నిలబడి నగ్నంగా వున్న తన భుజం మీద ఎర్రటి అంగవస్త్రం వేసుకుంటూ అన్నాడు.

"అవును. నాకూ కొంచెం బడలికగా వుందివాళ. అలా పర్ణశాలలో కాసేపు నడుం వాల్చి, విశ్రాంతి తీసుకుంటే అదే సర్దుకుంటుంది" అని సూతుడు కూడా లేచాడు. ❀